# వ్యత్యాసాలు

'అచ్యుత'

"కమలం!"

"ఆఁ, వస్తున్నానండి"—నిమిషములో వచ్చింది కమల.

"ఎందుకు పిలిచారు!" అనే ప్రశ్నార్థక దృక్కులు ప్రసరించింది.

"ఈ గులాబి ఎంతచక్కగా ఉన్నదో చూడు! వెలుగు నీడలు చిత్రించడం నేర్పనా?"

"ఏమోనండి! చిరాకుగా ఉన్నది. రేపు నేర్చుకుంటాను, ఇవ్వాళ మాత్రం నిన్నటి మోడల్ 'Model,' పూర్తి చేస్తాను." అన్నది బద్ధకంగా.

"మొన్నయిచ్చిన పాఠం ఇంకా అప్పగిస్తూనే ఉన్నావు కదూ!" అన్నాడు ప్రభాకర్.

"అయ్యో! అన్నీ ఒకేసారి ఎలా తగలపడుతాయండీ" —అంటూ వంటగదివైపు వెళ్లింది కమల.

ప్రభాకర్ ఆలోచనలో పడ్డాడు. ......... చదువంటే చిరాకు, విజ్ఞానమంటేవిసుగు, స్త్రీజాతికి సహజమేమో ననిపిస్తుంది. ఆడవాండ్లకు చదువు అవసరమని చెప్పితే "మేము ఉద్యోగాలు చేస్తామా? ఊళ్లేలుతామా?" అనేది మొదటిప్రశ్న. ఎలాగో దానికి సమాధానం ఇచ్చేవరకు "ఇంటెడు పనితో ఎలా తంటాలు పడాలి? ఇటు సంసారం, అటుచదువు?" అని రెండోప్రశ్న తయారు! ఇంటిపని బరువు తగ్గించ డానికి పని మనిషి నేర్పాటుచేసినా ఏదోఒక సణుగుడు, ఉంటునే ఉంటుంది. ఆగర్భశ్రీమంతుల ఆడ బిడ్డలకు అసలే తృప్తిఉండదు, ఎన్ని ఆభరణాలున్నా. అది వాండ్లకు చెల్లుబాటు. కాని మధ్యరకపు కుటుంబాలకు చెందిన స్త్రీలకు చెల్లుబాటు ఎలా అవుతుంది? వీళ్లూ సొమ్ముల యావలో పడటమంటే అందనిమ్రాని పండ్లకు అఱ్ఱు చాచడమే! ఈవిషయం తెలుసుకునేజ్ఞానం ఉండకూడదు? జీవితం ఆనందంగా గడపాలంటే ఏంచేయాలో తెలియదు. పుష్టికరమైన జాతిని సృష్టించడంలో తాము ఏవిధంగా తమ విధిని నెరవేర్చగలరో తెలుసుకోలేని అజ్ఞానంలో స్త్రీఉంటే జాతి పురోభివృద్ధి ఎలా జరుగుతుంది? ఇటువంటి ఇల్లాండ్రమూలాన జాతికి తిరోగమనంవినా "అన్యథాశరణం నాస్తి" అంటే అతిశయోక్తి కాదేమో! ఒక వైపు పిల్లలపోషణ తెలియదు; మరోవైపు ఇంటి సౌందర్యం చూస్తే ఇల్లాలి గృహనిర్వహణా నైపుణ్యం ఇట్టే బయట పడుతుంది. ఇటువంటి ఇంటిలో అడుగిడు మగవాడికేలా ఉంటుందో ఏం ఊహించ గలుగుతారు!!......" ఈ విధమైన ఆలోచనా పరంపర మెదడులో పరువులు తీస్తున్నాయి.

నిజంగా ప్రభాకర్ మనస్తత్వం అగోచరం. లలితమై భావసముదాయంతోగూడి చక్కనిసంస్కారం, సునిశితభావ గాంభీర్యం అతనిహృదయంలో చోటుచేసుకున్నవి. ఈశ్వరదత్తమైన సహజాతాలు అతనిలో కళాంకురాలను నాటినవి. అభివృద్ధి పొందుచున్నకొలది అతని జీవితాశయ ఆదర్శాలు విశాలం కాసాగినవి. కళాక్షేత్రంలో కృషితోపాటు జీవితపరమార్థం విస్తృతం కాసాగింది. భౌతికజీవితావసరాలకు తగిన ఆర్జన మాత్రమే తనకర్తవ్యం అని నిర్ణయించుకున్నాడు. తదుపరి అతనికి అత్యంతప్రియమైనది కళాజీవితములోని సౌందర్యమయరసజగత్తు. ఐహికాముష్మికముల రెంటిని సమన్వయించు జీవిత విధానమే అతని లక్ష్యం! పవిత్రమైన సామాన్యజీవితం, గంభీరమై ఉజ్జ్వలమైనభావన- అతని ఆశయం. తదనుగుణ్యంగా ఇంట-బయట తన జీవితాన్ని తయారుజేసుకోదలచి కృషిచేస్తున్నాడు. తనజీవితాన్ని విజయవంతంచేసుకోవాలంటే తనజీవిత సహభాగినియైన కమలం సహకరించడం అవసరమని గుర్తించాడు. "స్త్రీకి విద్య విజ్ఞాన చైతన్యాలుకలిగించి

ధీరోదాత్తులైన సత్పుత్రీపుత్రులను దేశమాతకు కానుకగా సమర్పించడమే ప్రతిమానవుని ఏకైక కర్తవ్యం” అని అతని నిశ్చితాభిప్రాయం. కర్తవ్యం నెరవేర్చడంలో కొంతవరకు కృతకృత్యుడు కాసాగాడు... కాని అడుగడుగున దినగండమే, గృహజీవితంలో.

అతని అర్ధాంగి కమల. రూపసౌందర్య ప్రేమానురాగాల్లో పోటీ చేయగలిగినా అతని ఆశయ ఆదర్శాలను అర్థంచేసుకోలేక పోయినది. ఆమెది అదోతీరు వింతప్రకృతి. ఆమెకు భర్తయందలి అనురాగమెంతో చెప్పవలసివస్తే భానూదయానికై నిరీక్షించుచున్న పద్మినీకాంతకు తీసిపోదు. నిర్మలప్రేమపాశంతో అతని హృదయాన్నే బంధించింది.

ఇన్ని ఉన్నప్పటికి ఇరువురిలో చెప్పదగిన వ్యత్యాసాలు కనిపిస్తయి. ఇరువురిజీవిత దృక్పథాలు వేర్వేరు. ఆశయ ఆదర్శాలు భిన్నం. ఒకరిది సంకుచితం, కేవలం భౌతికమూనూ! మరొకరిది విశాలం. కేవలం ఆధ్యాత్మికమేకాక ఐహికాన్నికూడా అనుసంధించే ఆదర్శమే లక్ష్యం. ఒకరిది నిరర్థకం, అనర్థకమూనూ! మరొకది ఇహపరముల రెంటిని సమన్వయించుకొన్న ఉన్నతాదర్శసంపన్నం. ఈ వ్యత్యాసాలను పురస్కరించుకొని పరస్పరం కలిగే మానసికసంచలనం చాలచిత్రంగా ఉంటుంది.

ఆమెలోని విద్యాసంస్కారశూన్యత ఆమె ఆశయఆదర్శాలను సంకుచితపరచింది. ప్రేమించి ప్రేమింపబడడం, భర్తకు సేవచేయడం, పిల్లలకనడం, కడుపునిండ తినడం, ఒంటినిండా బట్టకట్టడం, కృత్రిమ అలంకారాలతో సంఘంలో తనగొప్పను చాటబూనడం ...... ఇత్యాదితో నిండిఉంటుంది ఆమె జీవిత పరమార్థం. కలవారి ఆడబడుచుల్లకు నగ-నాణ్యెంయొక్క వాంఛచెల్లుబడి అవుతుంది, మధ్యరకపు స్త్రీ సందర్భానుసారంగా పరిసరాలకు లోబడి, భ్రమకులోంగి ఆవేదనకు గురిఅవుతుంటుంది. అందుకనే చదువంటే చిరాకు వినువూనూ!!

అతని విశాల, ఉన్నత, ఉజ్వలఆశయ ఆదర్శాల ననుసరించి జీవితములో పొందదగినది కేవలము శారీరకముగాక హృదయానందమే జీవితపరమార్థం. “ఆనందో బ్రహ్మయటన్న బ్రానుడి” నిసాధించడమే అతనికి కావలసినది. కళాజీవితములో రసమయజగత్తులో విహరించడమే మార్గం. కళాక్షేత్రంలో చేస్తున్నకృషికి ఫలితంగా కలిగే ఆనందానుభవాన్ని అందరికి అందజేస్తున్నప్పుడు తనజీవిత సహభాగినియైన కమలకుమాత్రం ఎందుకు అందజేయకూడదు?

“వెన్నెల రాత్రులలో ...... ఇసుకతిన్నెలపై ...... గొంతులుకలిపి ...... గానంచేస్తూ... మైమరచి కమలతోగడపితే ఎంతహాయిగాఉంటుంది” తానువ్రాసేచిత్రాలకు కమల భావాలుఅందిస్తు రంగులు కలిపిఇస్తుంటే చిరస్థాయిగా నిలిచిపోయేచిత్రాలు తయారుకావు?

తాను వ్రాసినగేయాలను ఆమె తన హృత్తంత్రులమీటి శృతిగల్పి గానంచేస్తున్నప్పటి ఆనందం తనకెన్నడోకదా! — ఈవిధంగా కలలు కంటూఉంటుంది అతని కళాహృదయం.

ఇవన్నీ కమలానికి అగమ్యగోచరం. పైగా బంధనలవలెకనిపిస్తయి. అందుకని ఆమెకదో తీవ్రవేదన.

అతనికి ఆమెలో చైతన్యంకలిగించి తన ఆదర్శశిఖరం అధిరోహించటం ఎలా? అనే ఆవేదన! ఇది నేటికీ విడదీయరాని సమస్య అయిపోయింది...........